

సీఎంను కలిసిన ఎంపీ బలరాంనాయక్

మహబూబాబాద్‌టౌన్, ఆగస్టు 14 :హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విదేశీపర్యటన ముగించుకుని బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎంపీ వివరించారు.


హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న పోరిక బలరాంనాయక్

పంద్రాగస్టు సంబురం

నేటి స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్న ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్‌లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరిగే ఎన్టీఆర్ స్టేడియం



మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మహబూబాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియం ముస్తాబైంది. 2016లో మహబూబాబాద్ నూతన జిల్లాగా ఆవిర్భవించిన నాటి నుంచి స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏటా పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలోనే నిర్వహిస్తున్నారు. గురువారం జరిగే పంద్రాగస్టు వేడుకల కోసం అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యఅతిథి ప్రసంగించేందుకు వేదికను ఏర్పాటు చేశారు. వేదికకు కుడి, ఎడమవైపు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు కూర్చునేందుకు షామియానాలను సిద్ధం చేశారు. జిల్లాలోని వివిధ శాఖల్లో జరిగిన అభివృద్ధిని వివరించే ఫొటో ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్ల పరిశీలన..

మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అధికారులతో కలిసి పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎవరికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రసంగిస్తారని వివరించారు. వేడుకలకు వచ్చే స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖులు, అధికారులు, అతిథులు, మీడియా ప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రౌండ్‌లో శానిటేషన్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. వర్షకాలం నేపథ్యంలో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అభివృద్ధిపై ఫొటో ఎగ్జిబిషన్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవో అలివేలు, అధికారులు నర్మద, నోముల రవీందర్, అభిమన్యుడు, మరియన్న, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోతు రాంచంద్రునాయక్ హాజరు కానున్నారు. ఉదయం 9.45 గంటలకు రాంచంద్రునాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం 9.50 గంటలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.55 గంటలకు ముఖ్యఅతిథి ప్రసంగం, 10.10 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, 10.20 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు, 10.40 గంటలకు శకటాల ప్రదర్శన, 10.55 గంటలకు ఉత్తమ ఉద్యోగులకు ప్రశాంసా పత్రాలు అందజేత, 11.15 గంటలకు వివిధ శాఖల స్టాళ్లను సందర్శించనున్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'


నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు

నెహ్రూసెంటర్, ఆగస్టు 14 : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జూనియర్ వైద్యుల అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మధు డిమాండ్ చేశారు. మానుకోట పట్టణంలో జూనియర్ వైద్యులు, వైద్యవిద్యార్థుల ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి నుంచి నెహ్రూసెంటర్ మీదుగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలందించే వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యులు, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 14 : పండగలు, ఇతర సెలవుల కారణాంగా మానుకోట మార్కెట్‌కు ఈనెల 15వ తేదీ నుంచి 19 వరకు సెలవుదినాలుగా ప్రకటించినట్లుగా మార్కెట్ కార్యదర్శి శంషీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న స్వాతంత్ర్య దినోత్సవం, 16న వరలక్ష్మి వ్రతం,వ్యాపారస్తుల కోరిక మేరకు, 17న వారాంతపు సెలవు, 18న ఆదివారం సెలవు, 19న రాఖీపౌర్ణమి సందర్భంగా మార్కెట్ యార్డు బంద్ ఉంటుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, మార్కెట్‌కు ఎలాంటి సరుకులు తీసుకురావొద్దని సూచించారు. ఈనెల 20న మంగళవారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందని చెప్పారు.

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మానుకోట మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 : మానుకోట పట్టణాభివృద్ధిలో ప్రజలుభాగస్వాములు కావాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మునిసిపల్ 19వ వార్డులోని అనంతారం రోడ్డు ఆర్వోబీవద్ద కాలనీలో రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మానుకోట అభివృద్ధే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రతాపని పాండురంగయ్య, చిదిరాల శరత్, గునిగంటి జగన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు సముచిత న్యాయం

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


మహబూబాబాద్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్‌టౌన్, ఆగస్టు 14 : కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని 96 మంది లబ్ధిదారులకు రూ.96,11,136 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొనారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, అర్బన్‌అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, కౌన్సిలర్ పోతురాజు రాజు, రవినాయక్, బండి వెంకన్న, శ్యామ్, పింగ్రాల రాందాసు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు అంకితభావంతో పనిచేయాలి'

నెల్లికుదురు : అధికారులు అంకితభావంతో పనిచేసి, గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం బాటతో విద్యుత్ సమస్యలు పరిష్కానికి నోచుకున్నాయన్నారు. విద్యుత్ సమస్యలు లేకుండా అధికారులు పనిచేయాన్నారు. నాటిన మొక్కలను బతికించుకోవాలన్నారు. రైతు రుణమాఫీపై రైతులకు అవగాహన కల్పించడంలో బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులు విఫలమవుతున్నారని రైతులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెల సమీక్షా సమావేశం ఉంటుందని అధికారులు నెల రోజులలోపు గ్రామాలలో సమస్యలు పర్కిరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల లొల్లి

- మండల పార్టీ అధ్యక్షుడి ఫొటోలేదని చించివేత
- ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత
- కార్యక్రమానికి గైర్హాజరైన డోర్నకల్ ఎమ్మెల్యే



నర్సింహులపేట చౌరస్తాలో కట్టిన ఫ్లెక్సీ, ఫ్లెక్సీని చించి కింద పడేసిన దృశ్యం

నర్సింహులపేట, ఆగస్టు 14 : నర్సింహులపేట కాంగ్రెస్ పార్టీలో ఫ్లెక్సీలో ఫొటోలలొల్లి తారాస్థాయికి చేరింది. వివరాల్లోకి వెళితే. ఏటా శ్రావణ మాసం పురస్కరించుకొని నర్సింహులపేటలో ముత్యాలమ్మతల్లి బోనాల పండుగ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా బుధవారం ముత్యాలమ్మతల్లి బోనాలు పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు నర్సింహులపేట చౌరస్తాలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో మండల పార్టీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకుండా.. ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యం ఇచ్చారని గ్రామస్థాయి యువజన నాయకులు ఆగ్రహంతో ఫ్లెక్సీలను చించివేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ శ్రేణుల మధ్య నెలకొన్న ఈ గొడవ విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్ ముత్యాలమ్మతల్లి బోనాల కార్యక్రమానికి గైర్హాజరవడం చర్చనీయంగా స్థానికంగా మారింది.

నర్సింహులపేట కాంగ్రెస్‌లో తగ కొంతకాలంగా పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా చీలిపోయి.. ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా చాపకింది నీరులా వ్యవహారాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్న సమయంలో కాంగ్రెస్‌లో వర్గ విభేదాలతో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొన్నట్లు సమాచారం.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

మానుకోటలో బోనాలతో నృత్యాలు చేసిన హిజ్రాలు


మహబూబాబాద్ నెహ్రూసెంటర్‌లో బోనాలతో నృత్యం చేస్తున్న హిజ్రాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14: జిల్లాలో బుధవారం ముత్యాలమ్మ తల్లి బోనాలు ఘనంగా జరిగాయి. మాను కోట పట్టణంలో బోనాలతో హిజ్రాలు నృత్యాలు చేసిన తీరు అందరినీ ఆకట్టుకుంది. కొత్తబజారు నెహ్రూసెంటర్‌లో హిజ్రాలు బోనాలను నెత్తిన ఎత్తుకుని, బ్యాండుమేళాలతో ఊరేగుతూ నృత్యాలు చేసి ముత్యాలమ్మ తల్లి గుడివద్దకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాతబజారులోని శిఖార్‌ఖాన్‌గడ్డ, దాసరి బజారు, గాయత్రిగుడి సమీపంలోని ముత్యాలమ్మ ఆలయాల వద్దకు మహిళలు చేరుకొని బోనాలు చెల్లించి, మొక్కులు మొక్కులు సమర్పించుకున్నారు.

- సీరోలు మండల కేంద్రంతో పాటు కాంపల్లి, చింతపల్లి గ్రామాల్లో గ్రామదేవతలైన ముత్యాలమ్మ తల్లుల వద్దకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు.
- కురవి మండలంలోని గుండ్రాతిమడుగు, అయ్యగారిపల్లి, తట్టుపల్లి, నేరడ గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లుల ఆలయాల వద్దకు మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.
- నర్సింహులపేట మండల కేంద్రంతో పాటు కొమ్ములవంచ, పడమటిగూడెం, పెద్దనాగారం, రామన్నగూడెం, జయపురం గ్రామాల్లో బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జినకల రమేష్, తహసీల్దార్ నాగరాజు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు దస్రూనాయక్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

బోనాల పండుగలో ఎమ్మెల్యే

కేసముద్రం : మహమూద్‌పట్నంలో నిర్వహించిన బోనాల పండుగలో ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొన్నారు. కేసముద్రం విలేజిలో ఇదే రోజున బోనాల పండుగను నిర్వహించారు. అయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.


చింతపల్లిలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు చెల్లించేందుకు వెళ్తున్న మహిళలు


అయ్యగారిపల్లిలో బోనాలు చెల్లించేందుకు వస్తున్న మహిళలు

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్
నిర్వాహకుడి అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 14: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడు మాడిశెట్టి ప్రసాద్‌ను టాస్క్‌ఫోర్స్, కేయూ పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో పట్టుకున్నారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లో నివాసం ఉంటున్న ప్రసాద్ మహారాష్ట్రకు చెందిన సునిల్‌తో కలిసి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అతడి బ్యాంక్‌లో ఉన్న రూ.32లక్షల డిపాజిట్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, బెట్టింగ్ పెట్టడం వలన ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించవచ్చని అమాయకులను మోసం చేస్తూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుండేవాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, కేయూ పోలీసులు దాడులు చేసి నిర్వాహకుడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

సబ్‌స్టేషన్‌లలల్లో మానవరహిత సేవలు ప్రారంభం : సీఎండీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 14: ఎన్పీడీసీఎల్ పరిధిలోని నక్కలగుట్ట, ఏజే మిల్స్ సబ్‌స్టేషన్‌లల్లో సాంకేతికతను ఉపయోగించుకొని మానవరహిత సేవలను ప్రారంభించినట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన ప్రతీ సమాచారం కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న స్కాడా సెంటర్‌కు వస్తుందని, సెంటర్‌లో ఉన్న టెక్నికల్ బృందం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ట్రిప్పింగ్ జరిగిన వెంటనే అలారం మోగుతుందని, వెంటనే టీమ్ సభ్యులు అప్రమత్తమై పవర్ ఆన్ అవుతుందన్నారు. రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారం అందుతుందన్నారు. లోపాలు ఉన్నప్పటికీ సరిదిద్దుకునే సౌకర్యం ఈ టెక్నాలజీలో ఉందన్నారు. బ్రేక్‌డౌన్ అయిన వెంటనే స్కాడా సెంటర్ నుంచి సంబంధిత ఏఈకు సమాచారం వెళ్తుందని, తద్వారా ఏఈ సిబ్బందితో వెళ్లి వెంటనే పునరుద్ధరణ పనులు చేయడం ద్వారా సమయం ఆదాతోపాటు వినియోగదారులకు యుద్ధప్రతిపాదికన సేవలను అందించడానికి వీలవుతుందన్నారు. సెప్టెంబర్ 30 వరకు హనుమకొండ, వరంగల్‌లో కలిపి 20 సబ్‌స్టేషన్‌లను మానవరహిత సబ్‌స్టేషన్‌లుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మారుతున్నకాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకొని అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకొచ్చి మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని సీఎండీ పేర్కొన్నారు.

తళుకులీననున్న 'కళా'వైభవం

● పూర్తికావొస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణపనులు ● సెప్టెంబరు 9న కాళోజీ జయంతి రోజున సీఎంచే ప్రారంభం?



ఆడిటోరియం లోపల పనులు జరుగుతున్న దృశ్యం



కళాక్షేత్రానికి రంగులు వేస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

2014లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన కాళోజీ కళాక్షేత్రం పదేళ్లు గడిచినా అసంపూర్తి పనులకే కళాక్షేత్రం పరిమితమైంది. ఇటీవల వరంగల్ పర్యటన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి కళాక్షేత్రం పనులపై దృష్టిసారించారు. కాళోజీ జయంతిలోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలతో అధికారులు కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై వేగం పెంచారు. సెప్టెంబరు 9న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

పదేళ్లుగా మొండి గోడలకే పరిమితం

కాళోజీ స్మారకార్థం గత ప్రభుత్వం 2014 సెప్టెంబరు 9వ తేదీన హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రానికి అట్టహాసంగా శంకుస్థాపన చేసింది. కుర్చీ వేసుకుని కూర్చుని ఏడాదిలోగా పనులను పూర్తి చేస్తానని అప్పట్లో కేసీఆర్ ప్రకటించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్‌తో కళాక్షేత్రం ప్లాన్ తయారు చేశారు. తొలుత రూ.50కోట్ల అంచనాతో కాళోజీ కళాక్షేత్రానికి నిధులు మంజూరుచేశారు. నాలుగు అంతస్థులుగా (జీ ప్లస్ 4) భవనాలు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. వీటిని మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తొలి దశలో సూపర్‌స్ట్రక్చర్ నిర్మాణం, రెండోదశలో ఇంటీరియల్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులను, మూడో దశలో ల్యాండ్ స్కేపింగ్, పాథ్ వే, పార్కింగ్ తదితర పనులు చేపట్టాలని నిర్ణయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, రిహార్సల్ రూమ్, గ్రీన్‌రూమ్, లాబీ, అలాగే మొదటి అంతస్థులో ఆర్టియం, ప్రీ ఫంక్షన్ ఏరియా, ఆఫీసు గదులు, ఫుడ్‌కౌంటర్, స్టోర్ రూమ్స్, వాష్ రూమ్స్ ఏర్పాటు చేస్తూ డీపీఆర్ తయారు చేశారు. అలాగే రెండో అంతస్తులో గ్రంథాలయం, ఆఫీసు, స్టోర్స్ లాబీ, వాష్‌రూమ్‌లు, మూడు, నాలుగో అంతస్తుల్లో ప్రీ ఫంక్షన్ లాబీ, బాల్కనీ, టెర్రస్, క్యాట్‌వాక్ లాబీ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేశారు. అయితే రెండేళ్లుగా నిధుల విషయంలో ప్రభుత్వం నాన్చుతూ వచ్చింది. కరోనాతో కాళోజీ కళాక్షేత్రం పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత నిర్మాణ వ్యయం రూ.50కోట్ల నుంచి రూ.85.10కోట్లకు పెరిగింది. అయితే గత ప్రభుత్వం రూ.40.10కోట్ల నిధులు మాత్రమే విడుదల చేయటంతో కళాక్షేత్రం పనులు నత్తనడకన సాగాయి.

సీఎం ఆదేశాలతో..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో కేవలం 60శాతం పనులు కూడా పూర్తి కాలేదు. బిల్లులు కూడా బకాయిలు ఉండటంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని కొత్త ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కాళోజీ కళాక్షేత్రంపై దృష్టి పెట్టారు. జూన్ 29వ తేదీన వరంగల్‌లో పర్యటించిన సీఎం కళాక్షేత్రంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిధుల కొరతపై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కళాక్షేత్రం పూర్తి చేయడానికి మరో రూ.45కోట్ల నిధులు అవసరమని వారు సీఎంకు వివరించారు. పూర్తి వివరాలతో డీపీఆర్ తయారు చేసి పంపించాలని సీఎం అధికారులను ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రానికి కావాల్సిన నిధులపై కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కూడా) అధికారుల నుంచి ప్రతిపాదనలు రావటంతో మంగళవారం రాత్రి కాళోజీ కళాక్షేత్రానికి రూ.45కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటికే రూ.40.10కోట్లు ఖర్చు చేయగా, తాజాగా ప్రభుత్వం రూ.45కోట్లు మంజూరు చేయటంతో మొత్తం రూ.85.10కోట్లతో కాళోజీ కళాక్షేత్రం వరంగల్ నగరంలో ఏర్పడనుంది. నిధులు కూడా రావటంతో కాళోజీ కళాక్షేత్రం పనులు వేగంగా జరుగుతున్నాయి.

జయంతి లోగా..

ఈ నెల 20వ తేదీలోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రత్యేకంగా కాళోజీ కళాక్షేత్రం నిర్మాణంపై దృష్టి పెట్టారు. ఈ నెల 20వ తేదీ వరకు పనులు పూర్తిచేసి, ఈ నెలఖారులోగా కళాక్షేత్రంలో కవులు, కళాకారులతో ట్రయల్ నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నారు. సెప్టెంబరు 9వ తేదీన కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తానికి ధిక్కార స్వరం కాళోజీ పేరుమీద నిర్మిస్తున్న కళాక్షేత్రంతో ఓరుగల్లుకు కళావైభవం రానుందని కవులు, కళాకారులు, రచయితలు, సాహితీవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

కళా కార్యక్రమాలకే..



హైదరాబాద్ రవీంద్రభారతి తరహాలోనే రూపుదిద్దుకుంటున్న కాళోజీ కళాక్షేత్రం కళా, సాహిత్య, ఆర్ట్ గ్యాలరీలకు ఉపయోగం కానుంది. కవి సమ్మేళనం, కళలు, సాహితీ చర్చలు లాంటి వాటికి వేదిక కానుంది. అయితే ప్రయివేటు కార్యక్రమాలకు కళాక్షేత్రానికి అద్దె ఇస్తున్నారనే వార్తలను కళా, సాహితీవేత్తలు వ్యతిరేకిస్తున్నారు. వివాహ, శుభకార్యాలయాల కు కళాక్షేత్రాన్ని అద్దెకు ఇస్తే దాని ప్రాశస్త్యం, ఉద్దేశం పక్క దారి పడుతుందని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కళా, సాహితీ కార్యక్రమాలకు తప్ప వేరే ప్రయివేటు కార్యక్రమాలకు ఇవ్వకూడదని చెబుతున్నారు.

సీఎం చేతుల మీదుగా కళాక్షేత్రం ప్రారంభం

ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కుడా చైర్మన్, వరంగల్



కాళోజీ నారాయణరావు స్మారకార్థం నిర్మిస్తున్న కళాక్షేత్రం ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తాం. గత ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేయటంలో విఫలమైంది. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం దృష్టికి కళాక్షేత్రం పరిస్థితిని తీసుకెళ్లగా, వెంటనే రూ.45కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈనెలఖారులోగా కళాక్షేత్రం పూర్తి చేసి, సెప్టెంబరు 9న ప్రారంభిస్తాం.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య



కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

బాలసముద్రం, ఆగస్టు 14: హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అవసరమైన మేరకు కూలీల సంఖ్యను పెంచి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంటర్ ఆర్జేడీ రాధాబాయికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఐఈవో గోపాల్ తదితరులు

విధుల్లో చేరిన ఇంటర్ ఆర్జేడీ జయప్రదబాయి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14: ఇంటర్మీడియెట్ వరంగల్ ఆర్జేడీగా జయప్రదబాయి బుధవారం విధుల్లో చేరారు. గతంలో హైదరాబాద్‌కు తరలించిన ఆర్జేడీ కార్యాలయాన్ని వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరిన ఆర్జేడీ జయప్రదబాయి.. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్జేడీ కార్యాలయ ఏర్పాటును పరిశీలించారు. తరలింపునకు ముందు ఆర్జేడీ కార్యాలయంలో పనిచేసిన సిబ్బంది వెంటనే రిపోర్టు చేయాల్సిందిగా ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా హనుమకొండ డీఐఈవో ఎ.గోపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, అధ్యాపకులు ఆర్జేడీ జయప్రదబాయికి శుభాకాంక్షలు తెలిపారు.

వినియోగదారుల జాతీయ సదస్సుకు సాంబరాజు చక్రపాణి

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అంబాజీలో జరిగే వినియోగదారుల జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ చీఫ్ సెక్రెటరీ నిధి ఖరే, వివిధ కేంద్ర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొంటున్నారు. వినియోగదారుల మండలి జాతీయ కమిటీ చైర్మన్ డాక్టర్ అనంత్ శర్మ, అధ్యక్షుడు అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతి పాండ్య ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలకు సంబంధించి రూట్ మ్యాప్‌ను విడుదల చేస్తారని చక్రపాణి తెలిపారు.

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై విచారణ

- పదవి, అసోసియేట్ ప్రొఫెసర్ హోదాపై ఫిర్యాదులు
- ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు విచారణ బాధ్యతలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 14: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నియామకం, అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతిపై రగడ రేగుతోంది. ఈ మేరకు జూలై 29, 30 తేదీల్లో హనుమకొండకు చెందిన కేఎస్ రెడ్డితో పాటు వరంగల్ దేశాయిపేట రోడ్డు ప్రాంతానికి చెందిన బి.ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి చేసిన వేర్వేరు ఫిర్యాదులు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మల్లారెడ్డి నియామకం, అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతిపై విచారణకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. ఈ పరిణామాలు వర్సిటీలో బుధవారం వెలుగులోకి రావడంతో కలకలంగా మారింది.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి

ప్రొఫెసర్ మల్లారెడ్డి వర్సిటీలోని గణిత విభాగంలో నేరుగా 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అయితే నిబంధనల మేరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా అర్హతలు లేవని ఫిర్యాదుదారులు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తగిన అర్హతలు లేకున్నా.. అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదురాలు పేర్కొన్నారు. మల్లారెడ్డి నియామకం చట్టవిరుద్ధమని, వర్సిటీ నుంచి ఆయనను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా నియమితులైన మల్లారెడ్డి వర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు. యూజీసీ నిబంధనల మేరకు నేరుగా అసోసియేట్ ప్రొఫెసర్ అయ్యేందుకు ఐదేళ్ల బోధన అనుభవంతో ఇతర అర్హతలు మల్లారెడ్డికి లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రొఫెసర్ మల్లారెడ్డికి 2002- 2006 వరకు 4 ఏళ్ల 1 నెల మాత్రమే అనుభవం ఉందని, అందులోనూ ఇండస్ట్రీ అనుభవం టీచింగ్ కిందకు రాదని ఫిర్యాదులో వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన మల్లారెడ్డిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విచారణకు ఆదేశాలు

హనుమకొండకు చెందిన కేఎస్‌రెడ్డి, వరంగల్‌కు చెందిన బి. ప్రవీణ్ కుమార్‌ల ఫిర్యాదు మేరకు రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి నివేదిక అందచేయాలని కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్, ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఆదేశించారు. అయితే తనపై వచ్చిన ఫిర్యాదు విషయాన్ని రిజిస్ట్రార్ మల్లారెడ్డి ప్రస్తావిస్తూ... తనకు అమెరికన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవంతోపాటు మరో ఒకటిన్నరేళ్లపాటు హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బోధన అనుభవం ఉందని తెలిపారు. ఇండస్ట్రియల్ అనుభవంతో పాటుపాటు బోధనానుభవం ఆధారంగా తనకు పదోన్నతి లభించిందని వివరించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు.

'రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

సీరోలు, ఆగస్టు 14 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే, జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. చింతపల్లి వద్ద విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రైతుపొలం బాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అన్నింటిని తూచ తప్పకుండా అమలు చేస్తుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలేకుండా చేసేందుకే పొలంబాట కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ చేపట్టినట్లు తెలిపారు. డీఈ విజయ్, ఏడీఈ రమేష్, ఏఈ జయప్రకాష్ నారాయణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


చింతపల్లి వద్ద పొలంబాటలో పాల్గొన్న జాటోతు రాంచంద్రునాయక్

ముస్లింలకు సంక్షేమ పథకాలు

మరిపెడ : కాంగ్రెస్‌తోనే ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయని ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో మసీద్ ఏ రహనియా సదర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎంబీటీ రాష్ట్ర అధ్యక్షుడు అంజాదుతుల్లాఖాన్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మొదట్నించి కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీల కోసం ఎంతో పాటుపడిందని గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు నరేశ్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, అంబరీశ, తాజుద్దీన్, అఫ్జల్, అఫ్సర్, ఖలీల్, సర్వర్, యాకుబ్ పాష, బదిఉజ్జమా, సాధిక్, సాజిద్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ జ్యోతిబాపూలే బాలికల గురుకుల సిబ్బందికి గుర్తు చేశారు. ఎమ్మెల్యే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్ట్రర్లను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేవెంట స్థానిక కాంగ్రెస్ నేతలు, గురుకుల సిబ్బంది ఉన్నారు.

తొర్రూరు ఎస్సైగా ఉపేందర్ బాధ్యతలు



తొర్రూరు, ఆగస్టు14 : తొర్రూరు ఎస్సైగా జి.ఉపేందర్ బుధవారం బాధ్యతను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జగదీష్ ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని తిరుమలాయపాలెంనకు బదిలీ అయ్యారు. 20 రోజుల క్రితం పెద్దవంగరకు బదిలీపై వచ్చిన జి. ఉపేందర్‌ను తొర్రూరు ఎస్సైగా బదిలీ చేస్తూ మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సైని సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నర్సింహులపేట ఎస్సైగా సురేష్..



నర్సింహులపేట : మండల ఎస్సైగా మాలోతు సురేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన గండ్రాతి సతీష్ కురవి మండలానికి బదిలీపై వెళ్లగా, ఖమ్మం టూ టౌన్‌లో విధులు నిర్వహించిన ఎం.సురేష్ బదిలీపై నర్సింహులపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశానన్నారు. అనంతరం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సైని కలిసి బొకే అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

కురవి ఎస్సైగా సతీష్..



కురవి : కురవి ఎస్సైగా గండ్రాతి సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కురవి ఎస్సైగా పనిచేసిన గోపి సీసీఎస్ ఎస్సైగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నర్సింహులపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సతీష్ కురవి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలను చేపట్టారు.

సీరోలు ఎసైగా నగేష్..



సీరోలు : మండల నూతన ఎసైగా సీహెచ్.నగేష్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో సీరోలు ఎసైగా విధులు నిర్వహించిన విజయ్‌రామ్‌కుమార్ డీఎస్పీ మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెద్దగూడూరులో ఎస్సైగా విధులు నిర్వహించిన నగేష్ సీరోలుకు బదిలీపై వచ్చి విధుల్లో చేరగా, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మరిపెడ ఎస్సైగా సతీష్‌గౌడ్..



మరిపెడ : మండల ఎస్సైగా బోలగాని సతీష్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై తహెర్‌బాబాను మహబూబాబాద్ ఎస్పీకి అటాచ్ చేశారు. ఖమ్మం నుంచి సతీశ్‌గౌడ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఎస్సై సతీశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

తొర్రూరు, ఆగస్టు 14 : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆదనపు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ఓ ఇంట్లో నిల్వచేసిన 60 బస్తాలు (30 క్వింటాళ్ల) బియ్యాన్ని తనిఖీచేసి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. మాశెట్టి కిష్టయ్య అనే వ్యక్తి తనఇంట్లో అక్రమంగా నిల్వచేయగా, స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

10 లీటర్ల గుడుంబా స్వాధీనం

డోర్నకల్, ఆగస్టు 14 : మండలంలోని అమ్మపాలెంలో 10 లీటర్ల గుడుంబాను పట్టుకుని ఇందుకు బాధ్యులైన దేవిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కోటేశ్వర్ రావు తెలిపారు. బుధవారం ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని అమ్మపాలెంకు చెందిన దేవి గుడుంబా తయారు చేస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి, ఆమె వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దేవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరిజన మహిళపై దాడి

నెల్లికుదురు, ఆగస్టు 14 : ఓ గిరిజన మహిళపై దాడి చేసిన సంఘటన మండలంలోని రామన్నగూడెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. రామన్నగూడెంకు చెందిన ఓ యువకుడు తన బంధువులతో కలసి మహిళ ఇంటికి వెళ్లి దాడులకు పాల్పడ్డారని, ఆమెకు గాయాలు కాగా మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళపై దాడులకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

యువత యూత్ నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం, ఆగస్టు 14 : మండలంలోని ఉప్పరపల్లిలో 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న యువత యూత్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా ముదురుకోల సందీప్, ఉపాధ్యక్షుడిగా పలుస రాకేష్, ఎండీ.షబ్బీర్, ప్రధాన కార్యదర్శిగా గుండా కార్తీక్, కోశాధికారిగా తండ సుమన్, సహాయ కార్యదర్శిగా టేకుల శ్రీకాంత్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా గుండా కమలాకర్, ముదురుకోల రాజేష్, ముఖ్యసలహాదారులుగా కోమాకుల రమేష్, అడప రమేష్, ముదురుకోల రమేష్‌లను ఎన్నుకున్నారు.

ఏఐటీయూసీలో చేరిన 50 మంది ట్రాక్టర్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలో 50 మంది ట్రాక్టర్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ బుధవారం ఏఐటీయూసీలో చేరారు. వారందరికి సంఘం కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారధిరెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఏఐటీయూసీలో కార్మికులు చేరడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలో కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలే నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, పెరుగుకుమార్, మిర్యాల మల్లికార్జున్, నరసింహ, శివకృష్ణ, సతీష్, గౌతమ్, రమేష్, ఉప్పలయ్య, లక్ష్మణ్, సుధాకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.25 వేల సాయం

- యూత్ కాంగ్రెస్ నాయకుడి చేయూత


సబ్‌స్టేషన్‌తండాలో ఇంటి నిర్మాణానికి రేకులు అందజేస్తున్న పవన్‌కల్యాణ్

కేసముద్రం, ఆగస్టు 14 : ధన్నసరి శివారు సబ్‌స్టేషన్‌తండా జీపీ పరిధిలో గుగులోత్ సురేష్, యమున దంపతులకు ఇంటి నిర్మాణానికి రూ25 వేల విలువైన రేకులు, సిమెంటు స్తంభాలు, ఇతర సరుకులను ఇదే తండాకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు బాదావత్ పవన్‌కల్యాణ్ బుధవారం అందజేశారు. కూలీ పనులు చేసుకొని జీవించే ఈ దంపతులు ప్లాస్టిక్ కవర్లతో తాత్కాలిక గుడారంలో జీవిస్తూ ఇబ్బందులు పడుతుండడంతో వారికి ఈ సహాయాన్ని అందజేస్తున్న పవన్‌కల్యాణ్ తెలిపారు. గుగులోత్ వీరన్న, రాజశేఖర్, వాంకుడోత్ చక్రు, ఉబ్బపల్లి కృష్ణ, వీరు, నరేష్, బాలు, శరత్, వీరు పాల్గొన్నారు.

గూడూరు సీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్


రోగుల వార్డులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గూడూరు, ఆగస్టు 14 : గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులు, ఫివర్ సర్వేపై తీసుకుంటున్న చర్యలపై డీసీహెచ్ఎస్ డాక్టర్ వెంకట్రాములును వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, తదితర వైరల్ జ్వరాలు ప్రబలకుండ ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్యవివరాలను నమోదు చేయాలని సూచించారు. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఇన్‌పెషెంట్‌లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించాలని పేర్కొన్నారు. ఆస్పత్రి సిబ్బంది వివరాలు, ఇన్‌పెషెంట్, ఔట్‌పెషెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట సూపరిండెంట్ వీరన్న, గూడూరు మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14 : జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జడ్పీ, లోకల్‌బాడీ, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ తమ తమ పాఠశాలల విద్యార్థులచే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేయించాలని జిల్లావిద్యాశాఖాధికారి రామారావు బుధవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి సెప్టెంబరు 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో టీటీటీ.్సెజూజ్బీట ఖ్జీ.ఛిౌఝ లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2023-24 విద్యాసంత్సరంలో 7వ తరగతిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఈ విద్యాసంవత్సరం 8వ తరగతి చదువుచున్నవారైఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. జనరల్, వెనుకబడిన తరగతులకు చెందిన (బిసి)విద్యార్థులకు ఫీజు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.50 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు సెల్ నెంబర్ : 98497 61012ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి..

జిల్లాలోని గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో 8వ తరగతి చదువున్న విద్యార్థినీ, విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎస్ఎంఎంఎస్)కు సెప్టెంబరు 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనశాఖ అధికారి సైదా మాలోతు తెలిపారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో రెసిడెన్షియల్ సైకర్యం లేని విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను www.bse.telangana.gov.in సంప్రదించాలన్నారు.

మానుకోట ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రఘుపతిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 14 : మహబూబాబాద్ మండల పరిషత్ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.రఘుపతిరెడ్డికి మానుకోట ఇంచార్జ్ ఎంపీడీవోగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన బానోత్ రవికుమార్ హైదరాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో అదే కార్యాలయంలో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న రఘుపతిరెడ్డికి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజ్‌భవన్‌లో ఐఆర్‌సీఎస్ సమావేశం

- హాజరైన జిల్లా చైర్మన్ ప్రసాద్, రవిచందర్‌రెడ్డి


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సన్మానిస్తున్న ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిచందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 : హైదరాబాద్ రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ ఐఆర్‌సీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా చైర్మన్లతో బుధవారం సమావేశమయ్యారు. రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా రాజ్‌భవన్‌లో ఐఆర్‌సీఎస్ బాధ్యుల పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఐఆర్‌సీఎస్ మానుకోట జిల్లా చైర్మన్ వీవీ. ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో మహబూబాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించిన సేవలు, కార్యక్రమాల గూర్చి వివరించి గవర్నర్‌కు బుక్‌లెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ రాష్ట్ర చైర్మన్ అజయ్‌మిశ్రా, జాతీయ కార్యవర్గ సభ్యులు పి. విజయచందర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేయూత


బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేస్తున్న రవిచంద్ర

ఇనుగుర్తి, ఆగస్టు 14 : మండలకేంద్రానికి చెందిన దుబ్బాక రవి కుమారుడు రణధీర్ అనారోగ్యంకు గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. రణధీర్‌కు మెరుగైన వైద్యచికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు సిఫారసు చేయడంతో అధికారులు వెంటనే పరిశీలించి రూ.2 లక్షలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రణధీర్ తండ్రి రవికి ఎంపీ రవిచంద్ర చెక్కును అందజేశారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కేసముద్రం బంద్

కేసముద్రం, ఆగస్టు 14 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దమనకాండను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం కేసముద్రం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయించి ర్యాలీ జరిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, గాంతి వెంకటరెడ్డి, బచ్చు లక్ష్మీనారాయణ, బోనగిరి ఉపేందర్, లెంకలపల్లి శ్రీనివాస్, ఉప్పునూతల రమేష్, ఏలబోయిన కరుణాకర్, మదూరి దినేష్, మధు, నవీన్, శివ, రవి పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

డోర్నకల్, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ఇంటింటికి తిరిగి వివరించాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు డోర్నకల్‌మునిసిపల్ కేంద్రంలో బుధవారం బీజేపీ కార్యకర్తలు విద్యార్థులతో కలిసి జాతీయ పతకాన్ని చేబూని హర్‌ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రూరల్ పార్టీ అధ్యక్షుడు గణేష్‌నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఎందరో తమ ప్రాణాల నుపనంగా పెట్టి స్వాతంత్ర్యం కోసం పోరాడారని చెప్పారు. వారి నిస్వార్థ స్వాతంత్ర్య పోరాటాన్ని రాబోయే తరాలకు తెలిపేందుకు హర్‌ఘర్ తిరంగర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. బీజేపీ నాయకులు ఎస్‌కె.రెహమాన్, ఎస్‌కె.గఫూర్, లక్ష్మీనారాయణ వ్యాస్, అనిల్‌రెడ్డి, లాల్‌సింగ్, కాసర్ల సురేష్, నాగరాజు, శ్రీకాంత్, సుదర్శనం, వీరేందర్, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

- మరిపెడ : మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతీ ఇంటిపైన జాతీయ జెండాను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్టోజ్ గంగాధర్, భూక్యా లింగంనాయక్, భూక్యా దేవందర్, శ్రీను, హుస్సేన్ పాల్గొన్నారు.

'వినియోగదారులను మోసం చేస్తే చర్యలు'

- ఎరువుల దుకాణాల్లో కేసులు నమోదు

తొర్రూరు, ఆగస్టు 14 : వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి తూనికల కొలతల అధికారి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలు, జనరల్‌స్టోర్స్, కిరాణం దుకాణాలను ఆయన తనిఖీ చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎరువుల వ్యాపారులు ధరల పట్టిక ఏర్పాటు చేయకుండాఇష్టం వచ్చిన రీతిలో అమ్మకాలు చేపడుతున్నారని హెచ్చరించారు. మొత్తం 10 షాపు లు తనిఖీ చేయగా 43 వేల రూపాయల జరిమానా విధిస్తూ 3 కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా వినియోగదారుల సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి వింజమూరి సుధాకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

డోర్నకల్, ఆగస్టు 14 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు బండి నర్సింహారావుఅన్నారు. బుధవారం డోర్నకల్‌లోని ఎమ్మార్సీలో టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నర్సింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.నాయకులు అబ్దుల్ అజీజ్, తుమ్మ వెంకటప్పయ్య, నామ వెంకటేశ్వర్లు, వివేక్, శివప్రసాద్, శంకర్, రాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మూల మధుకర్‌రెడ్డి

పోడు రైతులకు రుణమాఫీ

- సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి

బయ్యారం, ఆగస్టు 14 : పోడు రైతులకు కూడా రుణమాఫీ వర్తింప జేయటంతో పాటు తిరిగి వారికి మళ్లీ రుణ సౌకర్యం కల్పించేలా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ మూల మధుకర్ రెడ్డి పేర్కొన్నారు. బయ్యారం సొసైటీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బయ్యారం సొసైటీ పరిధిలో ఇప్పటి వరకు రెండు దఫాలు కలిపి మొత్తం 778 మంది రైతులకు సంబంధించి రూ.కోటి తొంబై ఎనిమిది లక్షల రుణం మాఫీ ఆయనట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రుణమాఫీ- 2024 ప్రకారం రుణమాఫీ పొందిన పోడు రైతులకు తిరిగి రుణం మంజూరు చేసే అవకాశం కల్పించరాదని తొలుత డీసీసీబీ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని అన్ని పీఏసీఎస్ సొసైటీలు ఆదేశాలకు జారీ చేసినట్లు తెలిపారు. సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్, సీతారామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలి'

సీరోలు, ఆగస్టు 14 : పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మాజీ ఎంపీటీసీ విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ నివాసి దాత కల్పన రూ. 10 వేల విలువగల టై, బెల్టులు, డైరీలను బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన మాజీ ఎంపీటీసీ కొండపల్లి విజయ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత యూనిఫాం అందిస్తుందని, వాటికి తోడుగా టై, బెల్టులు, డైరీలు సమకూర్చడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానోపాధ్యాయుడు విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'వంతెనను నిర్మించండి'


నీటిలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

చిన్నగూడూరు, ఆగస్టు 14 : గుండంరాజుపల్లి శివారు జిన్నేలవాగుపై వంతెన నిర్మించాలంటూ బుధవారం ఆ గ్రామస్థులు నీటిలో దిగి నిరసన వ్యక్తం చేశారు. వర్షాకాలం రాగానే వాగు దాటి రాకపోకలు సాగించలేక విద్యార్థులు, గ్రామస్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. మండల కేంద్రానికి రావాలంటే వాగు దాటడం తప్ప మరోమార్గం లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ప్రాణాలను అరచేతితో పట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిన్నేల వాగుపై వంతెన నిర్మించేలాచర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

'సీఎం పర్యటనలో నిరసన తెలుపుతాం'

గార్ల, ఆగస్టు 14 : గోదావరి నదిపై నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీటినితెలంగాణ రైతులకు దక్కకుండా ఆంధ్ర ప్రాంతానికి తరలించే విధానాకు వ్యతిరేకంగా ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాని విచ్చేయుచున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అడ్డుకుంటామని రాష్ట్ర నాయకుడు మధు హెచ్చరించారు. బుధవారం గార్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లందు నియోజకవర్గం రోళ్లపాడు వద్ద నీటిస్టోర్ చేసి ఏజెన్సీ మండలాలైన టేకులపల్లి, బయ్యారం, గార్ల మండలాలకు నీటి అందించే ప్రణాళిలు సిద్ధం చేయగా, ఆనాడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రాజెక్ట్ డిజన్ మార్చి పాలేరు చెరువుకు మార్చి రైతుకు అన్యాయం చేయడం జరిగిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని ముగ్గురు మంత్రులతో కలిసినీటిని సత్తుపల్లి ప్రాంతానికి తరలించే పనులకు సీఎం ప్రారంభించడం సరైందికాదన్నారు. ఏజెన్సీ ప్రాంతా గిజనరైతులకు సమీకరించి రోళ్లపాడు ద్వారా బయ్యారం, చెరువు, గార్ల చెరువుకు సాగు నీరు అందించే వరకు ప్రజాపోరాటాలు చేస్తామన్నారు. ఈసమావేశంలో న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, ఎస్.లింగ్యా, నందగిరి వెంకటేశ్వర్లు, జిసక్రు, జడ సత్యనారాయణ, మాన్యానాయక్, గుడిచుట్టు శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

తొర్రూరు, ఆగస్టు 14 : బోనాల పండుగ (ముత్యాలమ్మకు మొక్కులు) వేడుకలను బుధవారం తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు దేవాలయాల వద్దకు చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసంలో నిర్వహించుకునే బోనాల వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి ఇండ్ల పండుగ వేడుకలను నిర్వహించుకున్నారు. ఆలయ నిర్మాణదాత డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్ రావు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు బోనాల వేడుకలలో పాల్గొన్నారు.

- తొర్రూరు రూరల్ : మండలం వ్యాప్తంగా ముత్యాలమ్మకు బోనాలను భక్తులు శక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా నిర్వహించారు. పత్తేపురం, వెల్లికట్టె, పోలేపల్లి, గోపాలగిరి, కంఠాయపాలెం, మాటేడు తదితర గ్రామాల్లో ఘనంగా బోనాలు నిర్వహించారు. బోనాల పర్వదినం సందర్భంగా అధికారులు ఆయా గ్రామాల్లో ఆలయాలను ఆలకరించి, విద్యుత్‌కాంతులు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా ఏర్పాట్లు చేశారు.
- చిన్నగూడూరు : మండల వ్యాప్తంగా ముత్యాలమ్మ బోనాలు నిర్వహించారు. తల్లికి భక్తిశ్రద్ధలతో, డప్పువాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి మొక్కులు సమర్పించారు. గ్రామప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామదేవతలకు బొడ్రాయికి నైవేద్యాన్ని సమర్పించారు. ముత్యాలమ్మకు పసుపు, కుంకుమలతో చీరలు సమర్పించి పూజలు చేశారు. గ్రామపెద్దలు కొమురెల్లి, సత్యం, అంబరీష, రఘు, రాజు, రాంమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మహాత్మజ్యోతిరావు పూలె బాలుర గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గురుకుల పాఠశాలలు, కళాశాలలకు స్వంత భవనాలు లేకపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్ల రాకేష్, మహేష్, నవీన్, ప్రవీణ్, వినయ్ పాల్గొన్నారు.